



భక్తిప్రపత్తులతో బక్రీద్


సిద్దిపేట పట్టణంలో చిన్నారుల సందడి


- మసీదు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు



సిద్దిపేట అర్బన్, జూన్ 17 : బక్రీద్ పర్వదినాన్ని జిల్లాలోని ముస్లింలు సోమవారం వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే మొదలైన సంబరాలతో ఈద్గా, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చాదారులతో సమాధుల వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ ఆచారం ప్రకారం మేక, గొర్రె మాంసాన్ని పేదలకు పంచారు. మెదక్ జిల్లాలో జరిగిన సంఘటనతో సిద్దిపేట జిల్లావ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం

హుస్నాబాద్ టౌన్ : హుస్నాబాద్‌లోని అలంగీర్ మసీద్‌లో సోమవారం బక్రీద్ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఎండీ అన్వర్, ఎండీ హసన్, అయూబ్, అక్తార్, ఇంతియాజ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్ తదితరులున్నారు.

సిద్దిపేట పట్టణంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఎరువులు, విత్తనాల కొరత ఉండొద్దు

- 21 నుంచి విడతల వారీగా గ్రామాల్లో పర్యటిస్తా..
- నియోజకవర్గంలోని 160 గ్రామాలకు అధికారులను తీసుకొస్తా
- 24న హుస్నాబాద్‌లో జాబ్‌మేళా
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్/అక్కన్నపేట జూన్ 17 : ఈ వర్షాకాలంలో వ్యవసాయానికి ఎరువులు, విత్తనాల కొరత లేకుండా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన హుస్నాబాద్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన హుస్నాబాద్, అక్కన్నపేట మండల నాయకులు, గ్రామశాఖ అధ్యక్షుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వారు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండకూడదని ఆయన సూచించారు. విద్యా, వైద్యం తాగునీరు తదితర ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ నెల 21 నుంచి నియోజకవర్గంలోని గ్రామాల్లో విడతల వారీగా పర్యటిస్తానని ప్రజల సమస్యలను తెలుసుకుంటానని పేర్కొన్నారు. అక్కన్నపేట మండలం నుంచే ఈ పర్యటన ప్రారంభిస్తానని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని 160 గ్రామాలకు అధికారులను తీసుకొస్తానని స్పష్టం చేశారు. మంత్రిగా తాను ఎక్కడ ఉన్నా హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఈ నెల 24న హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్‌లో జాబ్‌మేళా ఉంటుందని, అర్హతలను బట్టి ఉద్యోగాలుంటాయని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టే పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మండల అధ్యక్షుడు బంక చందు, చిత్తారి రవీందర్, నాయకులు మడప జయపాల్‌రెడ్డి, అక్కు శ్రీనివాస్, వెన్న రాజు, శ్రీనివాస్, వెంకటరెడ్డి, వెంకటస్వామి, జంగపల్లి అయిలయ్య, ముత్యాల సంజీవరెడ్డి తదితరులున్నారు.


మార్నింగ్ వాక్ చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మార్నింగ్ వాక్‌తో సమస్యలు తెలుసుకుంటూ

హుస్నాబాద్ పట్టణంలోని పలు కాలనీల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ మార్నింగ్ వాక్ చేస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు సమస్యలను మంత్రికి విన్నవించారు. కొన్నింటిపై అధికారులతో మాట్లాడి అప్పటికప్పుడే పరిష్కరించారు. పట్టణంలో జరుగుతున్న నేషనల్ హైవే నిర్మాణ పనులను పరిశీలించారు. పట్టణంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాన్ని సందర్శించారు. అలాగే మృతుల కుటుంబాలను పరామర్శించారు.

యువతకు స్ఫూర్తి ఎన్‌వైకే రామారావు

నాలుగు దశాబ్దాల క్రితం కరీంనగర్ నెహ్రూ యువకేంద్రం కో ఆర్డినేటర్‌గా పని చేసిన రామారావు ఎంతో మంది యువతకు స్ఫూర్తిగా నిలిచి నాయకత్వ లక్షణాలను పెంపొందించారని, ఆయన మరణం తీరని లోటని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రామారావు మృతి పట్ల స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో పొన్నం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, మోహన్‌రెడ్డి, గంగిశెట్టి మహేందర్, వీరేశం, చంద్రారెడ్డి, అంజయ్య తదితరులున్నారు.

భూముల మార్కెట్ విలువకు రెక్కలు..


ఫైల్

- ఆదాయం సమకూర్చుకునేందుకు ప్రభుత్వయత్నం
- రియల్ ఎస్టేట్ రంగానికి మరో దెబ్బ
- ఆగస్టు 1 నుంచి అమల్లోకి నూతన చార్జీలు
- నేటి నుంచి భూవిలువల సవరణ ప్రక్రియ మొదలు

గజ్వేల్, జూన్ 17 : స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖల ద్వారా ఆదాయం పెంచుకోవాలని భావిస్తున్న ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సాగు, సాగేతర భూముల మార్కెట్ విలువ పెంపునకు మొగ్గుచూపింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా రాబడి మార్గాలపై దృష్టిసారించింది. వాస్తవ విలువలకు, రిజిస్ట్రేషన్ విలువకు భారీ వ్యత్యాసం ఉందనే అంశాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విలువలను పెంచే విషయంపై తుది నిర్ణయం తీసుకుం ది. వచ్చే ఆగస్టు 1 నుంచి కొత్త మార్కెట్ విలువలను అమలులోకి తీసుకొచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం 2021, 2022వ సంవత్సరంలో మార్కెట్ విలువలు పెంచినప్పటి నుంచి సిద్దిపేట జిల్లావ్యాప్తంగా రియల్ ఎస్టేట్ (స్థిరాస్థి)మార్కెట్ పడిపోగా, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మరోసారి రియల్ వ్యాపారం కుదేలయ్యే అవకాశం కనిపిస్తుంది. తాజాగా ప్రభుత్వం 40 నుంచి 50 శాతానికి రిజిస్ట్రేషన్ విలువను పెంచే అవకాశం ఉందని తెలుస్తుంది. నేటి నుంచి భూవిలువల సవరణ ప్రక్రియ ప్రారంభం కానున్నది. దాదాపు నెలపాటు ఈ ప్రక్రియ కొనసాగనున్నది. అనంతరం అధికారులు సవరించిన విలువలతో కూడిన నోటీసులను జూలై 15న అందజేయనున్నారు. అనంతరం 15 రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణకు గడువు ఇచ్చిన ప్రభుత్వం ఆగస్టు 1 నుంచి కొత్త మార్కెట్ విలువలను అమల్లోకి తీసుకురానున్నది.

నేటి నుంచి ప్రక్రియ మొదలు

గ్రామాల్లో, పట్టణాల్లో భూ విలువల సవరణకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభం కానుంది. గ్రామాల్లో వ్యవసాయేతర భూములు రహదారులకు ఆనుకుని ఉన్న గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లోని భూముల విలువను అధికంగా పెంచాలని భావిస్తున్నారు. గ్రామపటాలను తీసుకుని ఇప్పటికే ఇంటి స్థలాలుగా మారిన సర్వే నంబర్లు, మారే యోగ్యత ఉన్న సర్వే నంబర్లు, జాతీయ, రాష్ట్ర రహదారులకు ఆనుకుని ఉన్న సర్వే నంబర్లను వేర్వేరుగా గుర్తించనున్నారు. సబ్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్ ఆయా గ్రామాలకు వెళ్లి ప్రత్యేకంగా సమాచారాన్ని సేకరించనున్నారు. ఆయా గ్రామాల్లోని పెద్దలు, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో మాట్లాడి ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరలను గుర్తించాల్సి ఉంది. బహిరంగ మార్కెట్ విలువలను సేకరించే విషయంలో తప్పులు జరగకుండా చూడాలని ఇప్పటికే అధికారులు ఆదేశాలిచ్చారు. మార్కెట్ విలువలను సేకరించిన అనంతరం ప్రస్తుతం ఉన్న భూ విలువలతో సవరించాల్సిన విలువను ప్రతిపాదించాల్సి ఉంటుంది. 5 నుంచి 6 కిలోమీటర్ల రేడియస్‌లో గ్రామాలు ఉండే తేడాలను జాగ్రత్తగా గమనించాలని, గ్రామంలో వేర్వేరు చోట్ల ఉన్న భూములు, ఆస్తులకు రెండు అంతకంటే ఎక్కువ విలువలను కూడా ప్రతిపాదించే అవకాశాన్ని కల్పించారు. వ్యవసాయ భూముల విషయంలో ప్రస్తుతం ఉన్న బహిరంగ మార్కెట్ విలువలను రెవెన్యూ, పంచాయతీ అధికారుల నుంచి తీసుకోవాల్సి ఉంటుంది.

జిల్లాలో భారీగా పెరగనున్న భూ విలువ

సిద్దిపేట జిల్లాలో భూవిలువలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. హైదరాబాద్‌కు అతి దగ్గరలో ఉండడం, హెచ్ఎండీఏ పరిధిలో మూడు మండలాలు ఉండడం, జాతీయ, రాష్ట్ర రహదారులు ఉండడంతో వాటి వెంట ఉన్న భూముల విలువలు పెరిగే అవకాశం ఉంది. గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ములుగు, మర్కుక్, వర్గల్ మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా వాటిలో భూమి విలువలు భారీగా పెరిగే అవకాశం ఉంది. ఇక రాజీవ్ రహదారి 80 కిలోమీటర్ల మేర విస్తరించి ఉండగా, మెదక్-ఎల్కతుర్తి జాతీయ రహదారి 85 కిలోమీటర్ల మేర, దుద్దెడ-సూర్యాపేట జాతీయ రహదారి 25 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఇటీవలే జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ అయిన చిట్యాల-సంగారెడ్డి రోడ్డు సైతం 40 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ రోడ్ల వెంట భూవిలువ లు పెరుగనున్నాయి. అంతేకాకుండా మునిసిపాలిటీలు అయిన సిద్దిపేట, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, చేర్యాల, హుస్నాబాద్, దుబ్బాకలలో భూమి విలువలు దాదాపుగా 40 నుంచి 50 శాతం మేర పెరిగే అవకాశం ఉంది.

మునిసిపాలిటీల్లో బ్లాక్‌ల వారీగా

ఇక మునిసిపాలిటీల్లో అధికారికంగా నిర్ధారించిన ప్రాంతాల వివరాలను సేకరించి నివాస, వాణిజ్య ప్రాంతాలకు వేర్వేరుగా విలువ నిర్ధారించాల్సి ఉంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆస్తులకు ఒకే విలువ ప్రతిపాదించాల్సి ఉంది. మునిసిపాలిటీ డోర్ నంబర్ల వివరాలను ఫాం-2లో పొందుపరచాల్సి ఉంది. మునిసిపాలిటీల్లో విలీన గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులకు తగ్గట్లుగా విలువను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. బ్లాక్‌ల వారీగా విలువను నిర్ధారించడంతో పాటు భవనాలకు ప్రత్యేకంగా గ్రౌండ్ ఫ్లోర్, ఇతర ఫ్లోర్లకు వేర్వేరు విలువలను నిర్ధారించే అంశాన్ని కేవలం ప్రధాన రహదారుల పక్కన ఉండే నివాస సముదాయాలకు వర్తింపజేయనున్నారు. ఇక సిద్దిపేట పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో జోనల్ అభివృద్ధి మ్యాపులు, మాస్టర్ ప్లాన్ ఆధారంగా విలువల సవరణకు ప్రతిపాదికగా తీసుకోనున్నారు.

రియల్ వ్యాపారం కుదేలయ్యే అవకాశం

2013లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూ విలువలను సవరించగా, దాదాపుగా ఏడేళ్ల అనంతరం 2021లో కేసీఆర్ ప్రభుత్వం భూమి విలువలను పెంచింది. ఆ తర్వాత 3, 4 నెలల వ్యవధిలోనే 2022లో మళ్లీ భూ విలువలను పెంచడంతో ఒక్కసారిగా రియల్ వ్యాపారం కుదైలైంది. 2022 నుంచి నేటి వరకు రియల్ వ్యాపారం ఆశించిన స్థాయిలో పెరిగిన దాఖలాలు లేవు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మరోసారి భూవిలువలను పెంచనుండడంతో రియల్ వ్యాపారంపై ఈ ప్రభావం ఏ మేరకు పడుతుందో అని అటు రియల్ వ్యాపారులు, ఇటు ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఆదేశాలు వచ్చాయి

- క్రిష్ణయ్య, సబ్ రిజిస్ట్రార్, గజ్వేల్

భూవిలువల పెంపు విషయమై ఆదేశాలు వచ్చాయి. ఎంత మేరకు పెంచాలి. ఎలా చేయాలనే విషయమై బుధవారం రోజున జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దాదాపుగా 30శాతం పెరిగే అవకాశాలున్నాయి. ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన రోడ్లు, ఇతర వాణిజ్య సముదాయాలకు విలువను పెంచే అవకాశాలున్నాయి.

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో
మరో రెండు పీజీ కోర్సులు

- మహిళా రెసిడెన్షియల్ కళాశాలలో పీజీ కోర్సు ప్రారంభం

సిద్దిపేటటౌన్, జూన్ 17: సిద్దిపేటలోని ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో మరో రెండు పీజీ కోర్సులు, అదేవిధంగా మిట్టపల్లి వద్ద ఉన్న మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ఒక పీజీ కోర్సు ప్రారంభమైనట్లు సోమవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో ఇప్పటికే 10 కోర్సులతో పీజీ తరగతులు నడుస్తున్నాయని, కొత్తగా ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ, ఎమ్మెస్సీ కంప్యూటర్స్‌లో 60 సీట్ల చొప్పున ఈ ఏడాది నుంచి ప్రారంభం కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. మిట్టపల్లి ప్రాంతంలోని మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల పీజీ కళాశాలగా అప్‌గ్రేడ్‌తో ఒక పీజీకోర్సు మంజూరైందని వివరించారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్ కోర్సు ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభంకానుందని చెప్పారు. యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిద్దిపేట నియోజకవర్గం విద్యాలయాల నిలయంగా విరాజిల్లుతుందని ఆయన స్పష్టం చేశారు.

తక్షణమే నిర్మాణాలు చేపట్టాలి

డిగ్రీ కళాశాలలో రూ.2.50కోట్లతో నిర్మించే 12 అదనపు తరగతుల గదుల నిర్మాణం తక్షణమే చేపట్టాలని సంబంధిత అధికారులను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశించారు. పనుల జాప్యంపై ఇటీవల నిర్వహించిన సమీక్షలో అధికారులపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట నియోజకవర్గం విద్యారంగంలో మరింత పురోగాభివృద్ధి సాధించేలా అటు విద్యాశాఖ, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అందరం సమష్టి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.

స్వచ్ఛందంగా మూసివేత

- మెదక్ పట్టణంలో పోలీసులు దుకాణాలను తెరిపించే ప్రయత్నం
- బంద్‌కు మద్దతు ప్రకటించిన వ్యాపారులు
- జిల్లా వ్యాప్తంగా బంద్ ప్రశాంతం
- ఘర్షణ నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్

మెదక్, జూన్ 17 : మెదక్‌లో జరిగిన దాడుల ఘటన కారకులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్, హిందువాహిని, బీజేపీ, బీజేవైఎంల ఆధ్వర్యంలో ఇచ్చిన జిల్లా బంద్‌తో సోమవారం వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. మెదక్ పట్టణంలో పోలీసులు దుకాణాలు తెరిపించడానికి ప్రయత్నం చేశారు. అయినప్పటికీ స్వచ్ఛందంగా బంద్ పాటించారు. జిల్లా ఎస్పీ బాలస్వామి ఆధ్వర్యంలో పట్టణంలో భారీగా పోలీసులు మోహరించారు. ఎస్పీ జిల్లా కేంద్రంలో పర్యటిస్తూ భద్రతను పర్యవేక్షించారు. పట్టణంలో 144 సెక్షన్ కొనసాగింది. ఎక్కడికక్కడ పోలీసు బలగాలు మోహరించాయి. కొత్త వారు కనిపిస్తే.. పోలీసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బక్రీద్ సందర్భంగా పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లింల సామూహిక ప్రార్థనలు ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగాయి. ప్రతీసారీ వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు హాజరై శుభాకాంక్షలు తెలిపేవారు. ఈసారి కేవలం మతపెద్దల ఆధ్వర్యంలోనే ప్రార్థనలు ముగిశాయి. పట్టణంలో పికెటింగ్‌ను కొనసాగిస్తున్నారు. జిల్లాలో బంద్ నుంచి ఆర్టీసీ బస్సులకు మినహాయింపు ఇవ్వడంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడలేదు. నిత్యావసర వస్తువులైన పాలు, కూరగాయల కొనుగోళ్లకు ఆటంకం వాటిళ్లలేదు. చేగుంట, రామాయంపేట, వెల్దుర్తి, హవేళీఘనపూర్, శివంపేట, కౌడిపల్లి, కొల్చారం, తూప్రాన్, నిజాంపేట, నర్సాపూర్, చిన్నశంకరంపేట తదితర ప్రాంతాల్లో బంద్ కొనసాగింది. పలుచోట్ల ఆందోళనలు నిర్వహించారు. తూప్రాన్‌లో ర్యాలీ నిర్వహించగా 23 మందిని అరెస్ట్ చేసి సాయంత్రం విడుదల చేశారు. అల్లర్లకు కారణమైన మరోవర్గం నిందితులను అరెస్ట్ చేయాలని, అక్రమంగా అరెస్టు చేసిన తమ వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.


బంద్ సందర్భంగా నిర్మానుష్యంగా మెదక్ పట్టణం

విద్వేషాలు రెచ్చగొట్టేది బీజేపీయే

రామాయంపేట, జూన్ 17 : మత విద్వేషాలు రెచ్చగొట్టేది బీజేపీ పార్టీయే అని టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్‌రావు విమర్శించారు. సోమవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి రామాయంపేటలో మాట్లాడారు. మెదక్ అల్లర్ల విషయంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌పై బీజేపీ నేత పంజా విజయ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మతాలను అడ్డు పెట్టుకుని రాజకీయం చేయటం తమ పార్టీ సంస్కృతి కాదన్నారు. మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ మండల అధ్యక్షుడ, కాంగ్రెస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్‌ని గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. ఎమ్మెల్యే రోహిత్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు అవాస్తవమన్నారు. అసత్య ప్రచారాలు చేస్తున్న పంజాను తరిమి కొడతామన్నారు.

ప్రభుత్వాలే
గోవధను అరికట్టాలి

- అఖిల భారత మత మందిర్ ప్రముఖ్ రామరాజు

అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలే గోవధ నిషేధాన్ని అమలుపరిస్తే ఘర్షణలకు తావుండదని అఖిల భారత మత మందిర్ ప్రముఖ్ రామరాజు అన్నారు. సోమవారం ఆయన మెదక్‌లో అల్లర్ల కేసులో అరెస్టు అయిన వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో చెక్‌పోస్టులు ఉన్నప్పటికీ రాష్ట్రంలోకి యథేచ్ఛగా వేల సంఖ్యలో గోవులు దిగుమతి అవుతుండడాన్ని చూస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి, డీజీపీ అనుసరిస్తున్న విధానాల పర్యవసానమేనన్నారు. ప్రభుత్వం సహకారంతోనే గోహత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. డీజీపీ, పోలీసు కమిషనర్లకు గోవధ నిషేధాన్ని కఠినంగా అమలు పరచాలని వినతులు సమర్పించామన్నారు. మెదక్‌లో జరిగిన ఇరువర్గాల ఘర్షణల నివారించడంలో పోలీసులు విఫలమయ్యారని మండిపడ్డారు. 80 శాతం జనాభా కలిగిన హిందువులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.


మాట్లాడుతున్న అఖిల భారత మత మందిర్ ప్రముఖ్ రామరాజు

బాగారెడ్డి సేవలు మరువలేనివి

● మాజీ డీసీసీబీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి

జహీరాబాద్, జూన్ 17: జహీరాబాద్ ప్రాంతానికి దివంగత నేత, స్వర్గీయ బాగారెడ్డి చేసిన సేవలు మరువలేనివని మాజీ డీసీసీబి చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బాగారెడి జయంతిని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి మాట్లాడారు. జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి బాగారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అటు రాజకీయాల్లో, ఇటు ప్రజల మధ్యలో ఉంటూ రాజకీయ పితామహుడిగా పేరొందడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివాజీ రావుపాటిల్, చంద్రకాంత్, బిచ్చిరెడ్డి, పాండురంగారెడ్డి, అప్సర్‌దిల్దార్, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కార్తిక్‌రెడ్డి పాల్గొన్నారు.

కేతకీలో మేడ్చల్ సివిల్ న్యాయాధికారి పూజలు



పూజలు చేస్తున్న అర్జున్

ఝరాసంగం, జూన్ 17: దక్షిణకాశీగా పేరొందిన కేతకీ సంగమేశ్వరాలయంలో సోమవారం మేడ్చల్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎం.అర్జున్ కుటుంబసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదమంత్రోశ్చరణలు, మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారికి అభిషేం, పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవం

వట్‌పల్లి/మనూరు, జూన్ 17: మండల పరిధిలోని దేవనూర్‌లో భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవ విగ్రహాలకు పూజారులు కల్యాణం జరిపించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అలాగే మనూరు మండలం పుల్‌కుర్తి గ్రామంలో సోమవారం నిర్వహించిన ఊరడమ్మ ప్రథమ వార్షికోత్సవంలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ పాల్గొని పూజలు నిర్వహించారు. అంతకు ముందు గ్రామస్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. జహీరాబాద్ ఎంపీగా గెలుపొందిన అనంతరం మొదటిసారి పుల్‌కుర్తిలో జరిగిన ఉత్సవాల్లో పాల్గొనడంతో గ్రామానికి చెందిన పోతుల సంగారెడ్డి ఎంపీని సన్మానించారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్



పొలంలో వేప పిండి, యూరియా కలిపి చల్లుతున్న రైతు(ఫైల్)

వేపతో చీడపీడల నివారణ

వేప నూనె, వేప పిండితో పంటలకు రక్షణ

- సేంద్రియ పద్ధతుల్లో వాడుతున్న రైతులు
- రసాయన ఎరువుల వాడకం తగ్గించేందుకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిద్దిపేట రూరల్, జూన్ 17: పూర్వకాలం నుంచి వేపచెట్టుకు ఒక ప్రత్యేకత ఉన్నది. వేప చెట్టులోని ప్రతీ అవశేషం ఒక్కో విశిష్టత కలిగి ఉంటుంది. వేప చెట్టు అవశేషాలు వైద్యంతో పాటు సాగులో.. పంటల్లో చీడపీడల నివారణలో ఎంతగానో ఉపయోగపడతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రకృతి పరంగా లభించే వేప పిండి, వేప నూనె, వేప కొమ్మలను సేంద్రియ ఎరువుల పద్ధతిలో రైతులు వాడుతుంటారు. వేప పిండి, కొమ్మలు భూమిని సారవంతం చేయడంతో పాటు పంట దిగుబడుల్లో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. వేపను పంట ఉత్పత్తుల్లోనూ, సేంద్రియ ఎరువులుగానూ రైతులు వాడుతూ ఫలితాలు పొందుతున్నారు. యాసంగి పంటల సాగు సమయంలో విత్తనాలు విత్తుకుంటారు. పంట సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించే పలు రకాల వేప ఉత్పత్తులు, వాటి ఉపయోగాలను వ్యవసాయశాఖ అధికారులు ముందస్తుగానే రైతులకు వివరిస్తున్నారు.

వేప నూనెతో పలు రకాల లాభాలు

ముఖ్యంగా పంటలో రసం పీల్చే పురుగులు, లద్దె పురుగులు, కాండం తొలుచు పురుగుల నివారణకు వేప నూనె ఎంతో ప్రయోజనం చేకూర్చుతుంది. లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల వేప నూనెను కలిపి మొక్కలపై స్ప్రే చేస్తే ఆ వాసనకు ఆడ రెక్కల పురుగులు గుడ్లు పెట్టడానికి అవకాశం లేకుండా చేయడంతో పాటు పెట్టిన గుడ్లను పొదగకుండా చేస్తుంది. గుడ్లు నుంచి వచ్చే లార్వాను సమర్థవంతంగా అరికడుతుంది. పంటలో రెక్కల పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. పురుగు ఉధృతిని బట్టి స్ప్రే చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చునని అధికారులు సూచిస్తున్నారు. పంటలను ఆశించే గొంగళి పురుగుపైన స్ప్రే చేస్తే ఆ పురుగు తర్వాత దశను చేరుకోలేక చనిపోతుంది. మొక్కజొన్న పంటలో వచ్చే కత్తెర పురుగు పంటలను ఆశించి తీవ్రంగా నష్ట పరుస్తుంది. దీని నివారణకు పది వేల పీపీఎం అజాడిరక్టిన్ను స్ప్రే చేస్తే పురుగు అదుపులోకి వచ్చి దిగుబడి తగ్గకుండా దోహదపడుతుంది.



వేప పిండితో తెగుళ్ల నివారణ

వేప పిండితో అనేకరకాల ఉపయోగాలు ఉన్నాయి. పంటల్లో చీడపీడల నివారణలో ఎరువుగా ఉపయోగిస్తున్నారు. ఎకరానికి నాలుగు నుంచి ఐదు సంచుల వేప పిండి వినియోగించడం ద్వారా క్రిమి కీటకాలను నివారించవచ్చు. పంటలో ముఖ్యంగా వేరుకుళ్లు, దుంపకుళ్లు వంటి తెగుళ్లను సమర్థవంతంగా నివారిస్తుంది. ఎండు తెగులు నివారణకు ఉపయోగించే ట్రైకోడర్మాతో పాటు 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి వాడితే మంచి ఫలితం లభిస్తుంది. యూరియా వాడే సమయంలో ఐదు కిలోల యూరియాకు కిలో వేప పిండి కలిపి వాడితే మంచి ఫలితాలు ఉంటాయని సూచిస్తున్నారు. యూరియాపై వేప పిండి ఒక పొరలా ఏర్పడడంతో తొందరగా నీటిలో కరిగి మొక్కకు బలాన్ని చేకుర్చుతుంది. వేప నుంచి నూనె తీశాక మిగిలే చెక్కను వృథా చేయకుండా భూమిలో వేయడం వల్ల 4 నుంచి 6 శాతం నత్రజని, భాస్వరం, పొటాష్ 0.5శాతం ఉంటుంది. వీటితో పాటు పంట లభించే సల్ఫర్ దిగుబడి పెంచడంలో తోడ్పడుతుంది.

రసాయన ఎరువులు తగ్గించే దిశగా..



ఎక్కువ శాతం రైతులు రసాయన ఎరువులు వాడకం వల్ల పంట పంటకు భూసారం దెబ్బతింటుంది. రసాయన ఎరువుల వాడకం నుంచి రైతులకు లాభసాటిగా వ్యవసాయం చేసేలా సేంద్రియ పద్ధతుల్లో ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్నాం. వేప పిండి, వేప నూనెలతో పంటలకు మేలు చేకూరుతుంది. వేపతో చీడపీడల నివారణతో పాటు పంట ఉత్పత్తులను నిల్వ చేయడంలోనూ ఉపయోగించవచ్చు. వేప పిండి, నూనె వంటి సేంద్రియ ఎరువులతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చు. ఆ దిశగా రైతులకు క్షేత్రస్థాయిలో రైతువేదికల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

- పరశురాంరెడ్డి, మండల వ్యవసాయ అధికారి, సిద్దిపేటరూరల్

స్థానికంగానే సమకూర్చుకోవచ్చు



వేప పిండి వాడాలనుకునే రైతులు వేపకాయలను స్థానికంగానే సమకూర్చుకోవచ్చు. ఇది వేపపండ్లు రాలే సమయం కాబట్టి వేపకాయలను సేకరించి ఎండబెట్టిన తర్వాత రోడ్డుపై పోసి ట్రాక్టర్ ద్వారా తొక్కించి వాడుకుంటే.. అంతకన్నా మించిన ఎరువు పంటలకు మరొక్కటి లేదు.

- నాగార్జున్, ఏఈఈవో, నారాయణరావుపేట

పంటకు రక్షణగా వేప గింజల కషాయం

రైతులు స్వయంగా వేప గింజల పొడిని ఒక బట్టలో కట్టి పది లీటర్ల నీటిలో పది గంటలపాటు నానబెట్టి కషాయం తయారు చేసుకోవచ్చు. తయారు చేసిన కషాయాన్ని వంద లీటర్ల నీటిలో వంద గ్రాములు కలిపి ఎకరానికి స్ప్రే చేస్తే పురుగు గుడ్డు దశ, కోశస్థ దశ, ప్యూపా దశలను సమర్థవంతంగా అరికట్టవచ్చునని అధికారులు సూచిస్తున్నారు.



రైతులకు అవగహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

జాలిగామలో దారుణం

- కుటుంబ కలహాలతో పిల్లలను సంప్‌లో ముంచిన తల్లి
- తర్వాత తానూ ఆత్మహత్యాయత్నం
- ఉరి పడకపోవడంతో బయటపడిన మానస
- పిల్లల పరిస్థితి విషమం.. హైదరాబాద్‌కు తరలింపు



శిరీష, అనన్య

గజ్వేల్, జూన్ 17: సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామలో దారుణం చోటు చేసుకున్నది. కుటుంబ కలహాలతో ఓ తల్లి పిల్లలను సంపులో ముంచి.. ఆ తర్వాత తానూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అయితే ఉరి పడకపోవడంతో బతికి బయటపడింది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పీర్లపల్లి రాజు-మానస భార్యాభర్తలు. కాగా సోమవారం ఉదయం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన మానస.. తన ఇద్దరు పిల్లలు శిరీష(3), అనన్య(11 నెలలు)లను ఇంటి ముందు ఉన్న సంప్‌లో ముంచింది. అనంతరం వారిని బయటకు తీసి, మంచంపై పడుకోబెట్టింది. అనంతరం తాను ఉరేసుకుంటున్న క్రమంలో చుట్టుపక్కల వారు గమనించి ఉరి నుంచి తప్పించారు. ఇదిలా ఉండగా అప్పటికే నీటిలో మునిగిన ఇద్దరు పిల్లల పరిస్థితి విషమంగా ఉండడంతో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వారిలో ఒకరిని గాంధీ ఆస్పత్రికి, మరొకరిని నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



ప్రణీత్‌కుమార్ (ఫైల్)

ములుగు, జూన్ 17: లారీ ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన ములుగు మండలం వంటిమామిడిలో సోమవారం ఉదయం చోటు చేసుకున్నది. సికింద్రాబాద్ నేరేడు మెట్ ఎక్స్‌రోడ్డు జెజె నగర్ కాలనీకి చెందిన ప్రకాష్ ప్రణీత్‌కుమార్(25) పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి హోండా యాక్టివా బండిపై వస్తున్నాడు. కాగా మార్గమధ్యలో వంటిమామిడి గ్రామ శివారులో కారును ఓవర్ టేక్ చేస్తుండగా.. వెనక నుంచి లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో ప్రణీత్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి ప్రకాష్ విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఖేడ్ చిత్రకారుడికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు



చిత్రకారుడు శివకుమార్

నారాయణఖేడ్, జూన్ 17: నారాయణఖేడ్ పట్టణానికి చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్, ఇండియా బుక్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. ఇప్పటివరకు దేశంలోని ప్రముఖులు, ఇతర సందర్భాలు వివిధ అంశాలకు సంబంధించి రావి ఆకులపై 1,005 చిత్రాలను వేసినందుకు ఆయనకు ఇండియా బుక్ ఆఫ్‌ది రికార్డులో చోటు కల్పించి సర్టిఫికెట్‌ను సోమవారం పంపించారు. ఈ సందర్భంగా శివకుమార్‌ను అభిమానులు, స్నేహితులు అభినందించారు.

మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులకు బ్లాక్‌బెల్ట్‌ల ప్రదానం



సంగారెడ్డిలో నిర్వహించిన బ్లాక్‌బెల్ట్‌ల అవార్డుల ప్రదానోత్సవంలో విద్యార్థులు

సంగారెడ్డి రూరల్, జూన్ 17: ట్విన్ డ్రాగన్ మార్షల్ అర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి, మాస్టర్ రమేష్ ఆధ్వర్యంలో సోమవారం బ్లాక్‌బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో వందమంది విద్యార్థులు పాల్గొనగా పదిమంది ఉత్తమ ప్రతిభ కనబర్చి బ్లాక్ బెల్ట్ సాధించారు. బ్లాక్‌బెల్ట్‌లు సాధించిన వారిలో హిమబిందు, వర్షా, నితీష్‌కకుమార్, శివకుమార్, అఖిల్‌గౌడ్, షానుద్దీన్, షయాన్, సూర్య, కిరణ్ ఉన్నారు. బ్లాక్‌బెల్ట్ సాధించిన వారిని యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాలకృష్ణ, శ్రద్ధ స్కూల్ ప్రిన్సిపాల్ పాండు, ప్రమోద్‌కుమార్, అకాడమీ గ్రాండ్ మాస్టర్ ప్రసాద్ అభినందించారు.

'గొర్రెల యూనిట్ల డీడీలు వాపస్ చేయాలి'

నారాయణఖేడ్, జూన్ 17: గొర్రెల యూనిట్ల కోసం డీడీలు కట్టిన లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లనైనా పంపిణీ చేయాలని లేదా డీడీలైనా వాపస్ చేయాలని ఖేడ్ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గొర్రెల యూనిట్ల కోసం లబ్ధిదారులు డీడీలు కట్టి ఏడాదికాలంగా ఎదురు చూస్తున్నారన్నారు. అటు గొర్రెలు పంపిణీ చేయక, డీడీలు వాపస్ ఇవ్వకపోవడంతో అప్పులు చేసి డీడీలు కట్టినవారు వడ్డీల భారం మోయలేక పోతున్నారన్నారు. ఇప్పటికైనా వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఆటోను తగలబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

కౌడిపల్లి, జూన్17: ఇంటి వద్ద నిలిపి ఉన్న ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టగా.. ఆటో పాక్షికంగా కాలిపోయిన సంఘటన మండల పరిధిలోని మహ్మద్ నగర్‌లో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన నీరుడి నవీన్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి తన ఇంటి సమీపంలో ఆటోను నిలిపాడు. సోమవారం ఉదయం లేచిచూసేసరికి ఆటో స్వల్పంగా తగలబడి పోయి ఉన్నది. గుర్తు తెలియని వ్యక్తులు ఆటోను తగలబెట్టారని నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్, జూన్ 17: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని లక్ష్మీప్రసన్ననగర్ కాలనీకి చెందిన వనం నవీన్(24) మట్టి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో కొన్నిరోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఉదయం ఇంట్లో స్నానానికి వెళ్లిన ఆయన ఎంతకీ బయటకు రాకపోవడంతో కుటుంబసభ్యులు బాత్‌రూమ్ డోర్ తెరిచి చూడగా.. సీలింగ్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతడిని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ బి.సైదా తెలిపారు.

వ్యాన్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

- ఒకరికి తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు

కొండపాక, జూన్ 17: వ్యాన్‌ను ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని దుద్దెడ శివారులో సోమవారం చోటు చేసుకున్నది. తాడూరుకు చెందిన నర్సింహులు అజాగ్రత్తగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ, సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న వ్యాన్‌ను ఢీకొట్టాడు. దీంతో ద్విచక్రవాహనంపై నుంచి పడి తీవ్రగాయాలయ్యాయి. టోల్ ప్లాజా అంబులెన్స్ సిబ్బంది చేరుకుని ప్రథమ చికిత్స చేసి, సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బంగారు గొలుసు అపహరించిన వ్యక్తిపై కేసు

కౌడిపల్లి, జూన్ 17: వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధి కౌడిపల్లికి చెందిన రాజం సుశీల ఆదివారం సాయంత్రం తన ఇంటి వద్ద కూర్చోని ఉన్నది. ఇదే గ్రామానికి చెందిన గుడ్డంల శరత్ వచ్చి రూ.100 కావాలని అడగ్గా.. తన వద్ద లేవని తెలిపింది. అక్కడి నుంచి వెళ్లినట్టు వెళ్లి.. వెనక్కి వచ్చి వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడును తెంపుకుని పారిపోయాడు. ఈ క్రమంలో వృద్ధురాలు గట్టిగా అరవగా.. గ్రామానికి చెందిన దర్జి మహేష్ వెంబడించి పట్టుకునే ప్రయత్నం చేసినా.. ఫలితం లేకుండాపోయింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా పుస్తెలతాడు విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని వృద్ధురాలు తెలిపింది.

రోగుల జీవితాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి గాయత్రీదేవి
- చౌటకూర్‌లో ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ సీజ్



చౌటకూర్‌లో ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న మెడికల్, పోలీసు అధికారులు

పుల్‌కల్, జూన్ 17: మారుమూల గ్రామాల్లో ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు తమ పరిధులకు మించి వైద్యం చేస్తూ రోగుల జీవితాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి గాయత్రీదేవి హెచ్చరించారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో రోగి మృతికి కారణమైన లక్ష్మీ వినాయక ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను గాయత్రీదేవి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య, పోలీసు అధికారులు సోమవారం సీజ్ చేశారు. మండలంలోని ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన బైరు మల్లేశం అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 15న (శనివారం) చౌటకూర్‌లో ఆర్ఎంపీ వైద్యుడు వెంకటేశంను సంప్రదించగా.. వైద్యం వికటించి మల్లేశం మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో లక్ష్మీ వినాయక ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను పుల్కల్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సాయికిరణ్, ఎస్ఐ కె.శ్రీకాంత్ ఇతర ఆరోగ్య సిబ్బంది ఆకస్మికంగా తనిఖీ చేసి, విచారణ జరిపారు. క్లినిక్‌లో ఆర్ఎంపీ వైద్యుడు వెంకటేశం రెండు బెడ్లు ఏర్పాటుచేసి తన పరిధికి మించి వైద్యం చేస్తున్నట్లుగా అధికారులు ధ్రువీకరించారు. పరిధికి మించి వైద్యం చేసి బైరు మల్లేశం మృతికి కారణమైనందున ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. సంగారెడ్డి జిల్లాలోని ప్రతీ గ్రామంలో ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు ప్రాక్టీస్ చేస్తున్నారని తెలిపారు. ఇదే క్రమంలో అమాయకులను ఆసరాగా చేసుకుని వారికి ఇష్టారీతిన చికిత్స చేసి మరణానికి కారణమైనట్లయితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్‌వో గాయత్రీదేవీ హెచ్చరించారు.

కట్టు కాలువను కబ్జాచేసిన పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి

హత్నూర, జూన్ 17: హత్నూర మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన పెద్ద చెరువు కట్టు కాలువను ఎస్‌సీఎల్ వేకా పరిశ్రమ యాజమాన్యం చెత్తాచెదారం వేసి చెరువులోకి నీరు రాకుండా చేస్తున్నదని, పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ కిషన్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కట్టు కాలువను పరిశీలించి, విలేకరులతో మాట్లాడారు. ఎన్‌సీఎల్ వేకా, సెక్కోలార్ యాజమాన్యాలు ప్రధాన రోడ్డు కల్వెట్ పైపులను చెత్తతో నింపడమే కాకుండా వేకా పరిశ్రమ లోపల కాలువను కబ్జా చేసి చెత్తాచెదారంతో నింపేశారన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేకా పరిశ్రమలోని కట్టు కాలువ పూడికతీసి, మెయిన్ రోడ్డు వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి, పెద్ద చెరువులోకి నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. లేనిపక్షంలో పరిశ్రమ ఎదుట రైతులతో కలిసి ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.



కాలువను పరిశీలిస్తున్న ఎంపీటీసీ

ఆక్సిజన్ ప్లాంట్ వినియోగంలోకి వచ్చేనా?

- రూ.50 లక్షలతో ఏర్పాటు చేసి.. వృథాగా ఉంచారు!



నర్సాపూర్ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంటులో ఏర్పాటు చేసిన సిలిండర్లు

నర్సాపూర్, జూన్ 17: నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడాది క్రితం రూ.50 లక్షలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ నిరుపయోగంగా ఉన్నది. నర్సాపూర్ ఏరియా ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చడంతో ఈ ఆస్పత్రికి ప్రతిరోజూ వందల సంఖ్యలో ఔట్ పేషెంట్లు వస్తారు. అలాగే ఇన్‌పేషెంట్లు 30 నుంచి 50 మంది వరకు చేరుతుంటారు. ముఖ్యంగా నియోజకవర్గ పరిధిలో రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాల వల్ల క్షతగాత్రులయ్యే వారిని కూడా ఇక్కడికే తీసుకువస్తుంటారు. వీరితో పాటు కుటుంబనియంత్రణ ఆపరేషన్లు, డెలివరీలు నిర్వహిస్తుండటంతో ఆస్పత్రి రోగులతో సందడిగా ఉంటుంది. ఈ క్రమంలో ఆస్పత్రికి వచ్చే రోగుల్లో అత్యవసర సమయంలో ఆక్సిజన్ అవసరమైతే అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఏడాదిక్రితం రూ.50 లక్షలతో 500 ఎల్‌పీఏ సామర్థ్యం గల సిలిండర్లతో ప్రత్యేకంగా ప్లాంటు ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటివరకు దానిని వినియోగించలేదు. బయట నుంచి సిలిండర్లను కొనుగోలు చేసుకుని వినియోగిస్తున్నారు. రెండునెల్లో ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంటు అందుబాటులోకి వస్తుందని అప్పట్లో అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీనికితోడు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉమ్మడి జిల్లాకు చెందిన దామోదర్ రాజనర్సింహ ఉన్నందున ఆక్సిజన్ ప్లాంటు విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా మూడు నెలల క్రితం ఇదే ఆస్పత్రికి ఫ్రీజర్లు తెచ్చినా.. వాటిని కూడా ఇంకా వినియోగించడం లేదు. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేస్తున్నా.. చిన్నచిన్న కారణాలతో వినియోగంలోకి తేకపోవడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు.



ఆస్పత్రి ఆవరణలో సిలిండర్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్లాంటు

వసతులకు నోచని తెలంగాణ కాలనీ

- పారిశ్రామిక పంచాయతీలో ఉన్నా అభివృద్ధి శూన్యం
- కోర్టు కేసు పేరుతో దశాబ్దకాలంగా నిధులు కేటాయించని పాలకవర్గం
- అధ్వానంగా తెలంగాణ కాలనీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ



తెలంగాణ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్ల పైనే ప్రవహిస్తున్న మురుగునీరు, కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారులు

జిన్నారం, జూన్ 17: పారిశ్రామిక మేజర్ పంచాయతీలో గల తెలంగాణ కాలనీ కనీస మౌలిక వసతులు లేక మురికి కూపంగా మారింది. చుట్టూ పరిశ్రమలు, పంచాయతీకి భారీగా ఆదాయం ఉన్నా.. 150 కుటుంబాలు నివసిస్తున్న చోట కనీస వసతులు కరువయ్యాయి. కోర్టు కేసు పేరుతో పంచాయతీ పాలకవర్గం అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వకపోవటంతో దశాబ్దకాలంగా పేదలు మురుగునీటితో నిండిన రోడ్లు, గుంతలమయంగా మారిన రహదారులు, పారిశుధ్య సమస్యల మధ్యే జీవనం సాగిస్తున్నారు.

వసతులకు దూరం

జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక పంచాయతీ పరిధిలో గల అల్లీనగర్ సర్వే నెంబరు 27లో ఉన్న తెలంగాణ కాలనీ 10 ఏళ్లుగా కనీస వసతులు లేక మురికి కూపంగా మారింది. ఇక్కడ అసైన్డ్ భూముల్లో స్థానిక పేదలు 150 వరకు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. కానీ స్థానిక పంచాయతీ, ప్రభుత్వ నిధుల నుంచి అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వటం లేదు. దీంతో కాలనీలో ఉన్న నివాసాల మధ్య రహదారులు గోతులమయంగా మారగా.. నివాసాల మధ్యనే డ్రైనేజీ మురుగునీరు ప్రవహిస్తున్నది. అదేవిధంగా పలు నివాసాల మధ్య మట్టి రోడ్లు పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండి ఉన్నాయి. కాలనీలో ఎక్కడచూసినా మురుగు నీటి ప్రవాహంతో దుర్గంధం వెదజల్లుతుంది. అంతేకాకుండా తాగునీరు, విద్యుత్ సమస్యలు కూడా ఉన్నాయి. అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు జరిపారని గతంలో రెవెన్యూ అధికారులు ఎక్స్‌కవేటర్లతో కట్టడాలను కూల్చేయగా.. తమ నివాసాలకు రక్షణ కల్పించాలని కొందరు పేదలు కోర్టును ఆశ్రయించారు. దీంతో పేదల నివాసాలు కూల్చిన అధికారులపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయగా.. ఓ మండల రెవెన్యూ అధికారి సస్పెండ్ కూడా అయ్యారు. దీంతో ఈ కాలనీ విషయం కోర్టులో ఉందంటూ పదేళ్లుగా ఇక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. నిజానికి తమ నివాసాలకు రక్షణ కోసమే పేదలు కోర్టును ఆశ్రయించగా.. ఏకంగా కోర్టులో కేసు ఉందంటూ అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వకపోవటం గమనార్హం.

నివాసాల క్రమబద్ధీకరణకు నోచుకోని వైనం

గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన నివాసాల క్రమబద్ధీకరణకు తెలంగాణ కాలనీ దూరమైంది. 2016 నుంచి 2021 వరకు మూడు పర్యాయాలు నాటి ప్రభుత్వం ప్రభుత్వ భూముల్లో నిర్మించిన నివాసాలను క్రమబద్ధీకరణకు అవకాశం ఇవ్వగా.. ఈ కాలనీవాసులు దరఖాస్తులు చేశారు. అయినా ఒక్క నివాసం కూడా రెగ్యులరైజేషన్ కాలేదు. దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసిన అధికారులు కాలనీవాసులకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవటంతో పేదల నివాసాలు క్రమబద్ధీకరణకు నోచుకోలేదు. కాగా నిధుల మంజూరీకి కోర్టు కేసును సాకుగా చూపుతున్న పాలకులు, అధికారులు స్థానికంగా ఉన్న వందలాది పరిశ్రమల నుంచి సీఎస్ఆర్, మానవతారూపంలో నిధుల సేకరణ జరిపి ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టవచ్చని కాలనీవాసులు చెబుతున్నారు. ఎన్నికల్లో మా ఓట్లు కావాలని తిరిగే నాయకులకు తమ కష్టాలు పట్టవా అని ప్రశ్నిస్తున్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో తమ కాలనీకి ఓట్ల కోసం వచ్చే నాయకులను మౌలిక వసతుల కోసం నిలదీస్తామని స్థానికులు తెలిపారు.


దుబ్బాక/మిరుదొడ్డి: అల్వాల్‌లో ఈద్గా వద్ద బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు


సిద్దిపేట రూరల్/నారాయణరావుపేట: ఈద్గా వద్ద శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు


మద్దూరులో బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు


గజ్వేల్: ముస్లింలకు ఈద్-ఉల్-జుహా శుభాకాంక్షలు తెలుపుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గ్రామగ్రామాన ఘనంగా బక్రీద్ వేడుకలు

గజ్వేల్, జూన్ 17: గజ్వేల్ పట్టణంలో బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్, ముట్రాజ్‌పల్లి, క్యాసారంలతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఈద్గాల వద్ద బక్రీద్ సందర్భంగా ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. గజ్వేల్‌తో పాటు ప్రజ్ఞాపూర్ ఈద్గా వద్ద ముస్లింలకు ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ. రాజమౌళి ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నవాజ్‌మీరా, టీఎంసీ చైర్మన్ సయ్యద్ యూసుఫ్, నాయకులు దుర్గాప్రసాద్, కనకయ్య, రవీందర్, జమీల్, స్వామిచారి, అక్బర్, ఖాజా, యూసుఫ్, పాషా, జలీల్, అజీజ్, సయిద్ తదితరులున్నారు.

● **మద్దూరు:** మండలంలో ముస్లింలు బక్రీద్ పర్వదిన్నాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మద్దూరు, లద్నూరు, సలాఖ్‌పూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పెద్దల సమాదుల వద్ద పూలుచల్లి ప్రార్థించారు. అనంతరం చిన్నాపెద్దా అందరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ, శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు షకీల్ అహ్మద్, నాయకులు తాజ్‌మహమ్మద్, ముంతాజ్‌హుస్సేన్, షౌకత్అలీ, షరీఫుల్‌హసన్, కరీమద్దీన్, ఫసియొద్దీన్, ఆరీఫ్ తదితరులు పలువురు ఉన్నారు.

● **సిద్దిపేట రూరల్/నారాయణరావుపేట:** మండలాల్లో బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆయా మసీదుల్లో, ఈద్గాల వద్ద మతపెద్దలు ప్రత్యేక సందేశం ఇచ్చారు. త్యాగానికి ప్రతీకగా నిర్వహించుకునే బక్రీద్ పండుగ ముస్లిం సమాజంలో సాటివాళ్లపై ప్రేమాభిమానాలు పంచేందుకు ప్రేరణ ఇవ్వాలని సూచించారు. అనంతరం ఒకరికొకరు శుభకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** దుబ్బాక మిరుదొడ్డి మండలాల్లోని ఆయాగ్రామాల్లో బక్రీద్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ఆయాగ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికి ఒకరూ బక్రీద్ శుభాకాంక్షలను తెలియజేసుకున్నారు.

● **చిన్నకోడూరు:** మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఈద్గా, మజీద్‌ల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.

● **చేర్యాల:** బక్రీద్‌ను చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల శివారులోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

● **సిద్దిపేట టౌన్:** రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లాహ్ హుసేన్‌ను సిరిసిల్లలోని గంబీరావుపేటలో ఆయన నివాసంలో, కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మల యాదగిరి, కలీమొద్దీన్, మంద పాండు, వాహబ్, అజ్మత్, చిన్న అజ్మత్, వంశీ, అరవింద్, మహేందర్, రాజిరెడ్డి, కన్నా తదితరులు పాల్గొన్నారు.


చేర్యాల: ఆలింగనం చేసుకుంటున్న చిన్నారులు


చిన్నకోడూరులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు


మద్దూరులో ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు


హుస్నాబాద్ టౌన్: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


సిద్దిపేట టౌన్: వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను సన్మానిస్తున్న పూజల హరికృష్ణ

స్వాభిమాన్, పతంజలి యోగ సమితి జిల్లా కార్యవర్గాల ఎన్నిక

సిద్దిపేట టౌన్, జూన్ 17: సిద్దిపేట జిల్లా భారత్ స్వాభిమాన్ ట్రస్టు, పతంజలి యోగ సమితి, యువభారత్ నూతన కార్యవర్గాలను రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్‌లు సోమవారం ఒక ప్రకటనలో ప్రకటించారు. బీఎస్‌టీ జిల్లా ప్రభారిగా తోట అశోక్, సహ ప్రభారీలుగా సాయి, కల్లపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రాములు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నర్సింహులు, కోశాధికారిగా శశికిరణ్‌లను నియమించారు. పతంజలి యోగ సమితి చీఫ్ పాట్రన్‌గా అయితా అంజయ్య, జిల్లా ప్రభారిగా సురేష్‌కుమార్, సహ ప్రభారీలుగా స్వామి, శ్రీనివాస్‌రెడ్డిలను నియమించారు. యువ భారత్ జిల్లా చీఫ్ పాట్రన్‌గా నవీన్, జిల్లా ప్రభారిగా కిషన్, సహ ప్రభారీలుగా వేణు, రాజేష్ ఖన్నాలు నియమితులైయ్యారు. జిల్లా కిసాన్ సేవా సమితి అధ్యక్షుడిగా నాగరాజ్, లీగల్‌సెల్ అధ్యక్షుడిగా శివాజీ గణేష్, యోగ సందేశ్ జిల్లా అధ్యక్షురాలిగా విజయలక్ష్మి, జిల్లా యోగా విస్తారక్‌గా గోపాలకృష్ణ, జిల్లా సంవాద్ ప్రభారిగా నాగభూషణం, జిల్లా ఆఫీస్ ప్రభారీగా మహిపాల్‌రెడ్డి, సోషల్ మీడియా ప్రభారిగా మనోహర్‌లను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు

అడుగుకోగుంత వాహనదారులకు తంట

● బొల్లారం మున్సిపల్ కార్యాలయం ఎదుట దిగుబడిన ఆటో


బొల్లారం మున్సిపల్ కార్యాలయం ఎదుట గుంతలో దిగిన ఆటో

జిన్నారం, జూన్ 17: బొల్లారం మున్సిపాలిటీలో రోడ్లు గుంతలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ పరిధిలో మిషన్ భగీరథ కోసం తీసిన పైప్ లైన్ గోతిలో సోమవారం ఓ ఆటో కూరుకుపోయింది. ఏకంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట రోడ్డుపైనే ఈ ఘటన చోటుచేసుకోవడం రోడ్ల దుస్థితికి అద్దం పడుతుంది. మున్సిపల్ కార్యాలయం ఎదుట రోడ్డు పైనుంచి కూల్‌డ్రింక్, వాటర్ బాటిల్స్ లోడ్‌తో వెళ్తున్న ఆటో రహదారిపై ఇటీవల మిషన్ భగీరథ కోసం తీసిన గోతిలో దిగబడింది. అనంతరం ఎక్స్‌కవేటర్ సాయంతో ఆటోను బయటకి లాగాల్సివచ్చింది. పట్టణంలో భగీరథ పైప్ లైన్ గుంతలను సక్రమంగా పూడ్చకపోవడంతో స్థానికులు నిత్యం తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

ఎన్నికల విధుల్లో పాల్గొన్నవారికి డబ్బులు ఇవ్వరా?

● సీఐటీయూ నాయకులు


ఖేడ్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నారాయణఖేడ్, జూన్ 17: ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఆశా, మున్సిపల్ వర్కర్లకు డబ్బులు ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని సీఐటీయూ నాయకులు నల్లవల్లి రమేష్ విమర్శించారు. సోమవారం నారాయణఖేడ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల సమయంలో విధులు నిర్వహించిన ఆశా వర్కర్లు, మున్సిపల్ కార్మికులకు, జిల్లాలోని ఇతర మున్సిపాలిటీలలో, జీహెచ్‌ఎంసీలోనూ డ్యూటీ చేసినందుకు డబ్బులు చెల్లించారన్నారు. కాని నారాయణఖేడ్‌లో రెవెన్యూ అధికారులుమాత్రం డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అందువల్ల జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మున్సిపల్, ఆశా వర్కర్లకు వెంటనే ఎన్నికల డ్యూటీ డబ్బులు ఇప్పించాలన్నారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు సతీష్, పవన్, సంతోష్ తదితరులు ఉన్నారు.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కొందరికేనా?

● ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్

కొల్చారం, జూన్ 17: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా కొంతమంది రైతులకు మాత్రమే ప్రయోజనం చేకూరుతున్నదని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్ మాదిగ అన్నారు. కొల్చారంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి దేశవ్యాప్తంగా రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం తీసుకువచ్చి, పట్టా భూములు ఉన్న రైతులకు భూమి విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఏడాదికి రూ.6వేలు 2019 ఫిబ్రవరి నాటికి పట్టాలు పొందిన అర్హులైన రైతులకు మాత్రమే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వస్తుందన్నారు. ఆ తర్వాత పట్టాలు పొందిన రైతులకు మాత్రం ఈ పథకం ద్వారా లబ్ధి పొందే అవకాశం లేకుండా పోతున్నదని, మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఈ సారైనా నిబంధనల్లో మార్పులు చేసి అర్హులైన వారిని గుర్తించి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి అందే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ప్రమాదకరంగా మట్టి కుప్ప



కొమురవెల్లి నుంచి కొండపాక స్వాగతతోరణం మీదుగా రాజీవ్ రహదారికి చేరుకునే మార్గంలో గ్రామశివారులోని మూలమలుపు వద్ద నడిరోడ్డుపై మట్టి కుప్ప ప్రమాదకరంగా మారింది. కొన్నాళ్లక్రితం స్వాగత తోరణం నుంచి మల్లన్న ఆలయం వరకు డబుల్ లేన్ రోడ్డుతో పాటు రైల్వేఅండర్ పాస్ నిర్మాణం చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలను నిలిపివేస్తూ, మూలమలుపు వద్ద మట్టి కుప్పలు పోశారు. కానీ చాలా రోజుల క్రితమే అండర్‌పాస్ నిర్మాణ వద్ద డైవర్షన్ ఏర్పాటుచేసినప్పటికీ, మట్టికుప్పను తొలగించకపోగా, ఎలాంటి హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు.

- చేర్యాల



కూడళ్లలో వెలగని దీపాలు

గజ్వేల్ చుట్టూ ప్రధాన రహదారులను కలుపుతూ గత ప్రభుత్వం రింగ్ రోడ్డును నిర్మించింది. ఇందులో భాగంగా రాజీవ్ రహదారి వెళ్లే మార్గంలో 3 బ్రిడ్జిలను నిర్మించింది. బ్రిడ్జి నిర్మాణ ప్రాంతంలో బ్రిడ్జికి ఇరువైపులా కూడళ్లను ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాలకు వెళ్లడానికి రోడ్లు వేసింది. ఈ ప్రాంతంలో కొన్ని రోజులుగా లైట్లు వెలుగకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికులకు ప్రజ్ఞాపూర్ వెళ్లే రోడ్డు ఏదో తెలియడం లేదు.

- గజ్వేల్‌టౌన్

రఘునందన్‌రావును విమర్శించే స్థాయి లేదు

● బీజేపీ నాయకులు

ములుగు, జూన్ 17: మెదక్ ఎంపీ రఘునందన్ రావును విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదని బీజేపీ ములుగు మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని క్షీరాసాగర్‌లో బీజేపీ నాయకులు మన్నె శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్‌లు రైతులతో కలిసి మాట్లాడుతూ.. గతంలో వెంకట్రామారెడ్డి కలెక్టర్ గా ఉన్న సమయంలో అసైన్డ్ భూములకు ఎన్‌వోసీ ఇప్పించుకుని పట్టాలు చేయించుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు ఆ భూములను అమ్ముకొని కోట్లు సంపాదించుకున్నారన్నారు. క్షీరాసాగర్ గ్రామంలో లాక్కున్న భూములను తిరిగి ఇప్పించాలని కోరారు. సమావేశంలో కొండపాక, జగదేవ్‌పూర్, గజ్వేల్ మండల పార్టీల అధ్యక్షులు, బాధితులు పాల్గొన్నారు.


ములుగు: రైతులతో కలిసి మాట్లాడుతున్న నాయకులు

రఘునందన్‌రావును కలిసిన నాయకులు

చేర్యాల, జూన్ 17: మెదక్ ఎంపీ రఘునందన్‌రావును సోమవారం బీజేపీ కొమురవెల్లి మండలాధ్యక్షుడు బూరుగోజు నాగరాజు, నాయకులు పుట్ట కనకయ్య తదితరులు హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ స్థితిగతులపై చర్చించారు. పార్లమెంటు ఎన్నికల్లో తపాస్‌పల్లిలోని 16వబూత్‌లో బీజేపీకి మెజారిటీ ఓట్లురావడంతో కనకయ్యను శాలువాతో సత్కరించించారు.

చిన్న షిర్డీ క్షేత్రంలో ఘనంగా వార్షికోత్సవం

చేర్యాల, జూన్ 17: చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లిలోని చిన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో సోమవారం 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర అర్చకులు గౌరీభట్ల శంకర్ శర్మ, అనిల్ శర్మలు శాస్త్రోక్తంగా సాయిబాబాకు విశేష అభిషేకం, పూజలు జరిపారు. సుప్రభాత సేవ, అలంకరణ, మహా నివేదన చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయిబాబా దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు విఠలయ్య, కత్తుల మాధవరెడ్డి, బట్టు మోహన్‌రెడ్డి, కత్తుల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చేర్యాల: పుట్టమన్ను, జలకడవలతో ఎదురుకోలు నిర్వహిస్తున్న పోతిరెడ్డిపల్లి గ్రామస్థులు

ఘనంగా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లిలో రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణ వేడుకల్లో భాగంగా సోమవారం ఘనంగా ఎదురుకోలు నిర్వహించారు. ఈ సంద్భంగా డప్పుచప్పుళ్ల నడుమ జలకడవల ఊరేగింపుగా పుట్టమన్ను తీసుకువచ్చారు. అనంతరం సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు.

రామునిబండలో సీతారాముల కల్యాణం

జగదేవ్‌పూర్, జూన్ 17: మండలంలోని జంగారెడ్డిపల్లిలో రామునిబండ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడి కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, స్థానిక మాజీ సర్పంచ్ కుమార్ తదితరులున్నారు.

పిడుగుపడి కాడెద్దులు మృతి

కుకునూరు పల్లి/చిన్నకోడూరు, జూన్ 17: పిడుగుపాటుకు రెండు కాడెద్దులు మృతి చెందాయి. ముద్దాపూర్‌లోని మంచాల వీరభద్రయ్య బాలరాజుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఉన్న రెండు కాడెద్దులు ఆదివారం అర్ధరాత్రి పిడుగు పడడంతో మృతి చెందాయి. పిడుగుపడి పాడి ఆవు మృతి చెందిన సంఘటన చిన్నకోడూరు మండలంలోని మాచాపూర్‌లో సోమవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన రైతు రేగుల నారాయణ రోజు మాదిరిగానే ఆదివారం సాయంత్రం తన పాడి ఆవును వ్యవసాయ బావి వద్ద చెట్టుకు కట్టేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున వెళ్లి చూడగా పిడుగుపడి పాడి ఆవు మృతి చెంది ఉన్నది. మృతి చెందిన పాడి ఆవు విలువ రూ. 70 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

రామోజీ రావుకు నివాళులు

సిద్దిపేట అర్బన్, జూన్ 17: సిద్దిపేట న్యూస్ పేపర్స్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చీకోటి వెంకటేశం, స్టేట్ సెక్రటరీ శ్రీశైలం, రమేష్ గౌడ్. ఉపాధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, లచ్చన్న పాల్గొన్నారు.

నా వంతు సహకారం అందిస్తా

● దివ్యాంగుడికి ఎంపీ భరోసా


రేగోడు జూన్ 17: తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, డిగ్రీ పూర్తి చేస్తే ఉద్యోగం ఇప్పిస్తానని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ దివ్యాంగుడు బండి హరికృష్ణకు భరోసా కల్పించారు. సోమవారం రేగోడు మండలం మర్పల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు బండి హరికృష్ణ జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్‌ను నారాయణఖేడ్‌లో కలిశారు. ఈ సందర్భంగా హరికృష్ణను ఆప్యాయంగా పలకరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తనకు కిడ్నీల సమస్య ఉన్నదని, వాటిని మార్చాలని, అందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కిడ్నీల మార్పిడి చికిత్స చేయిస్తానని చెప్పినట్లు తెలిపాడు. ఆర్థికంగా కూడా ఇబ్బంది ఉందని చెప్పడంతో ఏ సమస్య ఉన్న వచ్చి కలవాలని ఎంపీ సూచించారు.

బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రవీందర్‌గౌడ్

హుస్నాబాద్ టౌన్, జూన్ 17: బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పట్టణానికి చెందిన పచ్చిమట్ల రవీందర్ గౌడ్‌ను నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జక్కుల వెంకన్న తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్, రైతు సంఘం నాయకులైన రవీందర్‌గౌడ్ పూలే, అంబేడ్కర్ సిద్ధాంతాలకు ఆకర్షితులై సోమవారం బీఎస్పీలో చేరినట్లు ఆయన వెల్లడించారు. బీఎస్పీలో చేరిన తనకు నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి ఇవ్వడం హర్షనీయమని, సమాజంలో అన్ని వర్గాలకు సామాజిక న్యాయం బీఎస్పీతోనే సాధ్యమవుతుందని ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కటికం ఓం ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల శంకర్, ఉపాధ్యక్షులు ఈర్ల మల్లేశ్ ముదిరాజ్, నరేష్, సుధాకర్, నియోజకవర్గ అధ్యక్షులు వేల్పుల రాజు, శరత్, నరేష్, జేరిపోతుల రవీందర్ తదితరులున్నారు.

కాలం చెల్లిన చిప్స్ ప్యాకెట్ల విక్రయం

చేర్యాల, జూన్ 17: కొమురవెల్లి మండలకేంద్రంతో పాటు పొరుగు గ్రామాల్లో కాలం చెల్లిన చిప్స్ బిస్కట్లను విక్రయిస్తున్నా సంబంధితశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొమురవెల్లి మండలం గౌరాయపల్లిలో సోమవారం ఓ చిరుదుకాణంలో చిన్నారులు చింటూ నమ్‌కీన్ చిప్స్‌ప్యాకెట్లు కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్లారు. తీరా కుటుంబ సభ్యులు పరిశీలించగా, ఫిబ్రవరి 20వ తేదీ ఉంది. స్థానికులు ఈ విషయమై కాలం చెల్లిన చిప్స్ ప్యాకెట్లు విక్రయిస్తున్నారంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో చర్చనీయాంశ


చిన్నారులకు విక్రయించిన చిప్స్ ప్యాకెట్

సామాజిక సమరసతా వేదిక తెలంగాణ అధ్యక్షుడిగా నరేశ్‌బాబు



గజ్వేల్, జూన్ 17: సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా గజ్వేల్ పట్టణానికి చెందిన వైద్యుడు ఆకుల నరేశ్‌బాబు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో నరేశ్‌బాబును రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నరేశ్‌బాబు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సామాజిక సమరసతా వేదిక అఖిల భారత కన్వీనర్ శ్యాంప్రసాద్, రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, రాష్ట్ర ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

'నీట్‌ను రద్దు చేయాలి'

సిద్దిపూట రూరల్, జూన్17: నీట్ పరీక్షలో అక్రమాలు జరిగాయని, వెంటనే ఆ పరీక్షను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్వీ సిద్దిపేట నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పడిగే ప్రశాంత్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నీట్‌లో గ్రేస్ మార్కుల వల్ల రాష్ట్రం విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గుజరాత్‌లో జరిగిన నీట్ పరీక్ష లీకేజీలపై ప్రధాని, ఆ రాష్ట్ర సీఎం, ఎంపీలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్ పై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ కాలం వెల్లదిస్తున్నారని, విద్య శాఖను తన వద్ద పెట్టుకుని ఆ శాఖపై ఇప్పటివరకు సమీక్ష నిర్వహించకపోవడం విచారకరమన్నారు.


పడిగె ప్రశాంత్

కప్పతల్లి ఆట ఆడిన చిన్నారులు


గ్రామంలో కప్పతల్లి ఆట ఆడుతున్న చిన్నారులు

కుకునూరుపల్లి, జూన్ 17: జూన్ మొదటి వారంలో మురిపించిన వర్షాలు విత్తనాలు పెట్టే సమయానికి ముఖం చాటేశాయి. కొందరు రైతులు విత్తనాలు పెట్టిన పరిస్థితి లేదు. వరుణ దేవుడి కరుణ కోసం కప్పలను ఒక వస్త్రంలో వేసి రోకలికి మధ్యలో వాటిని కట్టి రోకలిని చెరో వైపు ఇద్దరు చిన్నారులు మోస్తూ, కప్పతల్లి ఆట ఆడారు. వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో కుకునూరుపల్లి మండల కేంద్రంలోని చిన్నారులు సోమవారం కప్పతల్లి ఆట ఆడారు. కప్పతల్లి, వాన దేవుడి పాటలు పాడుతూ, ప్రతీ ఇంటికి వెళ్లారు. చిన్నారులు చేసిన ప్రయత్నానికి వానలు పడతాయో లేదో వేచి చూడాలి.

మృతుడి కుటుంబానికి రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం

చేర్యాల, జూన్ 17: చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్, కల్లుగీత కార్మికసంఘం నాయకుడు మేరిండ్ల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ. రమణ, కార్యదర్శులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు తదితరులు సంఘం తరఫున రూ.1.50లక్షలు నగదు మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. శ్రీనివాస్ మృతి తమ సంఘానికి తీరనిలోటని ఈ సందర్భంగా వారు అన్నారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కోహెడ కొమురయ్య, బూడిద గోపి, రమేశ్, ఆశన్న, తిరుపతి, జంగన్న తదితరులు పాల్గొన్నారు.

దూళిమిట్ట కస్తూర్బా తరగతులు కొమురవెల్లి కస్తూర్బా భవనంలో!

● గతేడాది విద్యాసంవత్సరం మధ్యలో మంజూరు
● భవనం లేక ఇక్కడ తాత్కాలికంగా కొనసాగింపు
● 6,7తరగతులకు కొనసాగుతున్న అడ్మిషన్లు

చేర్యాల, జూన్ 17: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దూళిమిట్ట నూతన మండలంగా ఏర్పడిన అనంతరం, గతేడాది విద్యాసంవత్సరం మధ్యలో కస్తూర్బా పాఠశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ అనుకూల భవనం లేక, స్వంత భవనానికి నిధులు మంజూరుకాకపోవడంతో తరగతులు చేపట్టలేదు. ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో దూళిమిట్ట మండలకేంద్రంలో కస్తూర్బా పాఠశాలను నిర్వహించే పరిస్థితి లేక కొమురవెల్లి కస్తూర్బా భవనంలో కొనసాగించేందుకు చర్యలు తీసుకున్నారు.

కొమురవెల్లి కస్తూర్బా పాఠశాలలో గదులు..

కొన్నినెలల క్రితమే రాజీవ్ రహదారికి చేరువలో ఆధునిక హంగులతో కొమురవెల్లి కస్తూర్బా పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మించారు. మొదటి అంతస్తులో పలు గదులు ఖాళీగా ఉండడంతో దూళిమిట్ట కస్తూర్బాను అక్కడ నిర్వహించేందుకు నిర్ణయించారు. దీంతో 60మందికి పైగా అడ్మిషన్లు పొందడంతో 6, 7 తరగతులు ప్రారంభించేందుకు సన్నాహాకాలు చేపడుతున్నారు. కనీస వసతి లేకపోవడంతో గతేడాది సక్రమంగా నిర్వహించకపోవడం, పూర్తి గ్రామీణ ప్రాంతం కావడంతో కస్తూర్బాలో చేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపించలేదు.


కొమురవెల్లి కస్తూర్బా పాఠశాల భవనం

భవనం కేటాయింపుతో పెరిగిన అడ్మిషన్లు

ప్రస్తుతం కొమురవెల్లి పాఠశాల భవనంలో కొనసాగించనున్నట్లు తెలియడంతో అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. కానీ దూళిమిట్ట కస్తూర్బా పాఠశాల తరగతుల నిర్వహణకు సంబంధించి ప్రత్యేకాధికారితో పాటు సిబ్బంది నియామకం చేపట్టకపోవడంతో, కొమురవెల్లి ఎస్‌వోతో పాటు టీచర్లకే తాత్కాలికంగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మరికొంతమంది విద్యార్థులు చేరే అవకాశం ఉండడంతో త్వరలో తరగతులు ప్రారంభం కానుండడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

60పైగా అడ్మిషన్లు వచ్చాయి

దూళిమిట్ట కస్తూర్బా పాఠశాలకు భవనం లేకపోవడంతో కొమురవెల్లి కస్తూర్బా భవనం మొదటి అంతస్తులో 5గదులు కేటాయించారు. 6, 7 తరగతులకు సంబంధించి 60కిపైగా అడ్మిషన్లు వచ్చాయి. త్వరలోనే తరగతుల ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. దూళిమిట్ట ప్రాంత ప్రజలు పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలి.

- నీరజ కొమురవెల్లి కస్తూర్బా ఎస్‌వో